# మేజిక్‌రామ్

సీతాపతికి ఒక్కగానొక్క కొడుకు లేక లేక కలిగిన వాడుకావటాన అతి ప్రేమగా పెంచాడు. కొడుకు చదువుకని పెద్దవాడై గొప్పవుద్యోగం చేస్తుంటే కళ్లారా చూచి ఆనందించాలని ఆశ! సీతాపతి ఆశలన్నీ రామ్ మీదనే.

తండ్రి ఆలోచనలకు భిన్నంగ తయారైన ఆరామ్ టెన్త్ డింకీ కొట్టాడు. కొడుకు తప్పినందుకు సీతాపతి ప్రాణం విలవిల్లాడింది. ట్యూషన్ పెట్టి మళ్లీచదివించాడు. ఈసారి ఎట్లాగో అత్తెసరు మార్కులతో పాసైనాడనిపించాడు రామ్.

రామ్‌కి అసలు చదువు అంటే శ్రద్ధలేదు. ఇల్లు పట్టకుండా స్నేహితులతో తిరగటం అలవాటైంది. కొడుకుని ఎట్లా తీర్చి దిద్ది మంచి మార్గంలో పెట్టాలో బోధపడని సీతాపతి బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాడు.

'మా రామ్‌కి చదువు మీద మనసు బొత్తిగా లగ్నం కావటం లేదు. టెన్త్ రెండేళ్లు చదివాడంటే వాడి కున్న తెలివి తేటలు ఏ పాటివో అర్థం చేసుకోగలిగాను. వీడెలా బాగుపడతాడో ఏమో తెలీకుండావుంది. ఇలా అయితే ముందు ముందు ఎలా బతుకుతాడయ్యా? - దారివెంట నడుస్తూ ఆత్మీయ మిత్రుడు సదాశివంతో గోడువెళ్ల పోసుకున్నారు సీతాపతి

'కొందరు పిల్లలంతేనోయ్, చురుగ్గా చదువులో ఎక్కిరారు. అంత మాత్రాన వాళ్లెందుకు పనికి రారనే నిర్ణయానికి రాకూడదు. పనికి మాలిన వారి కిందజమకట్టేయలేము. ఏ విషయం పట్ల వాడికి ఆసక్తిగా వున్నదో గ్రహించి ప్రోత్సహిస్తే ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది. నువ్వూరికే వర్రీ అవకు!... నీ కొడుకులో గల టేలంటేమిటో పసికట్టి వెలికితీయ్! అంతా డాక్టర్లు ఇంజనీర్లు కలక్టర్లూ అవగలరా? - తనకు తోచింది చెప్పాడు సదాశివం.

ఇద్దరూ ఒకేస్కూల్లో టీచర్లు ఇంచు మించు ఒకే వయసు ఇద్దరిదీ!

సదాశివం కొడుకులిద్దరూ చదువులో బ్రిలియంట్స్! అన్నింటా ఫస్టే! టెన్త్‌లో ర్యాంకులొచ్చినయ్. ఇంటర్‌లోనూ అదేతీరు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్ వ్రాసి టాపర్స్‌గా నిలిచారు. ఒకరు మెడిసను... రెండోవాడు ఇంజనీరింగ్ చదువుతున్నారు.

ఆ పిల్లలను చూస్తుంటే సీతాపతికి ముచ్చటేస్తుంది. తనకొడుకు రామ్ వారిలా కాకపోయెనేని వాపోతూంటాడు.

'నువ్వు అదృష్టవంతుడివోయ్. ఏజన్మలోనో బంగారుపూలతో దేవుడిని పూజించుంటావ్. రత్నాల్లాంటి ఇద్దరు మగ పిల్లలకు తండ్రివి కాగలిగావ్. నీ పిల్లలను చూస్తుంటే నాకే ఇంత గర్వంగా వుంటే... తండ్రివై యుండి నువ్వెంత గొప్పగా ఫీలౌతుంటావో నేను అర్థం చేసుకోగలను. మా వాడూ వున్నాడు. ఎందుకు? దేనికి పనికి రాడు. 'కొరగాని కొడుకు పుట్టిన 'పద్యం' గుర్తుకొస్తుంటుంది నాకెప్పుడూ!

'సీతాపతీ! నిన్ను నీవు తక్కువ చేసుకుంటూ మాట్లాడకు. నాకు నచ్చదు. మనం కావాలనుకుని ఆరాట పడితేవచ్చేది కాదయ్యా అదృష్టం! అన్నీ మనం అనుకునేట్టే జరగవ్!

'వీడి కసలు ఇంటర్లో సీటొస్తుందోరాదోని బెంగగావుంది. సీటే కనుక రాకపోతే ఇంట్లో నుంచి గెంటేయ తల్చుకున్నాను. అడుక్కునైనా బతకు తాడు వెధవ..' కోపంతో రెచ్చిపోయి అన్నాడు సీతాపతి.'

'అదేవద్దు! దిగులు పెంచుకోకు! బిడ్డల నైతే కన్నాం గానీ వారి తలరాతలను అదృష్టాన్ని కనగలమా? దీనికో సామెతుంది. గుర్రాన్ని చెరువు దాకా లాక్కెళ్లగలం... కానీ బలవంతాన దాని చేత నీళ్లు తాగించ వీలవుతుందా? పిల్లలూ అంతే! రామ్‌ని విమర్శించటం మానుకో! - వాడిని అభిమానించి ప్రేమిస్తూవుండు. అన్నీ వాటంతట అవే చక్కబడతాయ్. నువ్వేం దిగులు పడకు..' ధైర్యాన్ని నూరి పోశాడు సదాశివం.

'నీకు ఇంటర్లో సీటు రాలేదనే విషయం తేలిపోయింది. నీ ముఖానికి చదువొచ్చే రాతలేదు. ఆ యోగ్యతను నీకై నువ్వే పోగొట్టుకున్నావ్! సరే! అయిందేదో అయిపోయింది. ఇప్పుడేం చేయాలనుకుంటున్నావో అదైనా చెప్పు! -' సీతాపతి రామ్‌ని నిలదీశాడు.

తన మనసులో మాట ఎలా వ్యక్తం చేయటమాని యోచిస్తున్నాడు రామ్.

'చదువు సంధ్య అబ్బని వాళ్లు ఏం చేస్తారో తెలుసురానీకు?... మూటలు మోస్తారు.. లేక పోతే జేబులు కొడతారు... అదీ కాకపోతే... నీలాంటి పోరంబోకులు నలుగురు ఏకమై దొంగతనాలకు పాల్పడతారు. పోలీసుల చేతిలో చావు దెబ్బలు తింటారు! .. . నోట మట్టి కొట్టుకుని.. అధోగతి పాలవుతారు!.. మరి నువ్వేం కాదలిచావో అదైనా చెప్పు! విని సంతోషిస్తాను. పొంగి వచ్చే కోపాన్ని ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుంటూ మట్లాడేడు సీతాపతి.

'వాడిని... అనరాని మాటలతో ఎందుకండీ అట్లా చిత్ర హింసలపాలు చేస్తారు? - కొడుక్కి వత్తాసొస్తూ మాట్లాడింది.

'నువ్ నోర్ముయ్!' ఉగ్రుడైనాడు సీతాపతి

'ఎందుకంత కోపం? చెప్పతల్చుకున్నదేదో నెమ్మదిగా చెప్పకూడదు...? -

'అవునే.. వాడి కాళ్లకి మొక్కి... టెంకాయ కొట్టి.. చేతులు జోడించి బ్రతిమాలితేగాని నీ కొడుకు నోట్లోంచి మాట పెగలదా? - 'వెటకారం ధ్వనించింది సీతాపతి మాటల్లో.

'వాడిని ఈ విషయం గురించే అడిగాను. వాడికి.. వాడికి మేజిక్ నేర్చుకుని గొప్ప మేజీషియన్ కావాలనివున్నదటండీ..'

'ఇంకా నయం... మంత్రాలు తంత్రాలు నేర్చుకుని ఏ భూత వైద్యుడో అవుతాననలేదు..'

'మీ వెటకారాలు ఆపి కాస్తనే చెప్పేది చెవినేసుకోండి! - వాడిని మీరు ప్రముఖ మెజీషియన్ పట్టాభిరామ్ గారి వద్దకు తీసుకెళ్లి ఆయన కాళ్లమీద పడేయండి. ఆపైన... మన రామ్‌కి మాజిక్ విద్య నేర్పమని ప్రాధేయపడండి! - అందుక్కావలసిన ఫీజేదైనా వుంటే నెలకు ఇంతని మనమిద్దాం! - ఏమంటారు? - '

'అహా! అలాగేం? తల్లీ కొడుకు లిద్దరూ కుమ్మక్కై ఈ నిర్ణయానికి వచ్చారన్నమాట!... సరే వాడికేది ఇష్టమైతే అదే చేద్దాం! ఈ విద్యలోనైనా ప్రావిణ్యత సంపాదిస్తాడో.. నోట మట్టికొట్టుకుంటాడో... అదీ చూద్దాం!'

భర్త మొత్తానికి తన ప్రపోజల్ అంగీకరించినందుకు అనసూయ 'బతుకు జీవుడా' అనుకుంది మనసులో.

రామ్ ముఖం కూడా సంతోషంతో పురి విప్పింది... తండ్రి తన కోరిక నెరవేర్చ బోతున్నందుకు.. తన ఆశయం సిద్ధించ బోతున్నందుకూ!

కేలండర్‌లో మంచి రోజు చూసి రామ్‌ని వెంట బెట్టుకుని ప్రొఫెసర్ పట్టాభిరామ్‌గారిని కలవటానికి బయల్దేరాడు.

తెలికగానే పట్టాభిరామ్ గారితో ఇంటర్వ్యూ దొరికింది. మనసులో విషయాన్ని వారికి వివరించాడు సీతాపతి.

'పుత్రుడి అభిరుచి తెలుసుకుని ప్రోత్సహించేవారు ఈ రోజుల్లోనూ అరుదుగా కన్పిస్తారు. అలాంటి అరుదైన వారిలో మీరూ వుండటం సంతోషదాయకం!... అన్నాడు పట్టాభిరామ్.

'మా వాడిని మీ శిష్యుడిగా స్వీకరించి మీ అంతటివాడిని చేయాలని కోరుకుంటున్నాను..'

'ఈ విద్య పట్ల రామ్‌కు వుండే శ్రద్ధ ఏకాగ్రత మీద ఆధారపడి వుంటుంది అతని భవిత!' మీరేం దిగులు పడకండి. మంచి తర్ఫీదు ఇస్తాను. రేపటి నుండి

సాయంత్రం క్రమం తప్పకుండా నాలుగు గంటలకల్లా నా దగ్గరకు రావాలి? - రెండేళ్ల పాటు కఠోర శ్రమ చేయాల్సి వుంటుంది రామ్! అబ్రకదబ్ర కిటుకులు నేర్చుకున్న పిదప.. అతనికే స్వతంత్రంగా మేజిక్ ప్రదర్శన లివ్వగల నేర్పు సాహసం అలవడుతుంది- ఇక మీరు వెళ్లిరండి!....

పట్టాభిరామ్ గారి మాటల మీద విశ్వాసం గురి కుదిరింది సీతాపతికి.

'మరి..ఫీజు విషయం..' నీళ్లు నమిలాడు'

'అదే మంత పెద్ద విషయంకాదు లెండి. రెండేళ్లకు కలిసి పదివేలుంటుంది. ఆరు నెలలు కడిచాక ఓ ఐదువేలు పంపండి. సెకండియర్‌లో మిగతాది ఈయచ్చు...'

'ఓస్! అంతే కదా అనుకున్న సీతాపతి లేచి నిలబడి, చేతులు జోడించి పట్టాభిరామ్ గారికి నమస్కరించి 'మా రామ్‌ను రేపటి నుండి పంపిస్తాను' అనేసి వెనుతిరిగాడు.'

★ ★ ★

రేండేళ్ల మేజిక్ కోర్స్ పూర్తి అయ్యే నాటికి ఓపెన్ యూనివర్సిటీలో బి.ఏ. పట్టా పుచ్చుకున్నాడు రామ్.

కొడుకు డిగ్రీ పొందినందుకు సీతాపతి సంబరపడ్డాడు.

మేజిక్ నేర్చుకుంటూ చదువుకూడా కొనసాగించమంటూ గురువు పట్టాభిరామ్ గారి సలహా మేరకు పట్టుదలతో డిగ్రీ చేజిక్కించుకున్నాడు రామ్.

నేర్చుకున్న మేజిక్ విద్యను ప్రదర్శించేటందుకు హైస్కూల్స్.. కాలేజస్‌ను వేదికగా ఎంచుకుని... అక్కడ ప్రదర్శనలిచ్చాడు.అందరి ఏత సెభాష్ అన్పించుకున్నాడు.

రాను రాను ఆత్మవిశ్వాసం పెరగడంతో పబ్లిక్ షోలు ఇచ్చేందుకు సంసిద్ధుడైనాడు. అందుకు కొన్ని సమాఖ్యలు సహాయపడి రామ్ ఇచ్చే మేజిక్ షోలకు టిక్కట్లు అమ్మే పద్ధతి ప్రవేశపెట్టి ఆ విధంగా రామ్‌కు ఆర్థిక సహాయం అందిస్తూ ముందుకొచ్చినయ్.

రాష్ట్రమంతటా పర్యటించి అనేక చోట్ల ప్రముఖుల సమక్షంలో మేజిక్ ప్రదర్వనలిచ్చి అభినందనలతో పాటు సత్కారాలు..బిరుదులు పొందే స్థాయికి ఎదిగాడు.

ఒకసారి రవీంద్ర భారతిలో ప్రత్యేకించి వి.ఐ.పి.ల కొరకు ఏర్పాటు చేయబడిన రామ్ మేజిక్ షోకి రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం వచ్చి తిలకించి ప్రదర్శన చూచి మనసు పులకించడంతో ప్రదర్శన అనంతరం వేదిక మీదికొచ్చి రామ్‌ని గాఢాలింగనమ్ చేసుకుని లక్షరూపాయల విరాళం ప్రకటించడంతో హాల్లో కరతాళ ధ్వనులు మిన్నుముట్టినయ్.

మేజిక్‌షోలలో ఎన్నెన్నో కొత్త కొత్త అయిటమ్‌లు ప్రవేశపెట్టి సక్సెస్ అయిన అతని పురోభి వృద్ధికి అవి బంగారు సోపానాలయినయ్.

కొడుకు సాధిస్తున్న విజయ పరంపరలు.. రామ్‌కొచ్చే ఆదాయం...పొందే బిరుదులు చూస్తూ తన్మయత్వంలో పులకించిపోతున్నారు.

'చూశావా సీతాపతి!.. నీ కొడుకు అప్రయోజకుడైనాడని...చదువు అబ్బలేదని..కొరగాని కొడుకు పుట్టాడనీ... అనేక విధాలుగా బాధపడిన విషయం గుర్తుందా? - ఇప్పుడు చూడు! రామ్ నీకు అందనంత ఎత్తుకు ఎదిగాడు. మున్ముందు ఇంకా ఇంకా వృద్ధిలోకొస్తాడు. ఎన్నో విజయాలు సాధిస్తాడు. ఇప్పుడు నీకు సంతోషమేనా? - 'భుజం తట్టి అన్నాడు స్నేహితుడు సదాశివం.

సీతాపతి నయనాలు తన్మయత్వంలో ఆనంద బాష్పాలు రాల్చాయి.

'ఇప్పుడురామ్ నా కొడుకన్పించుకున్నాడు. వాడిని చూస్తుంటే నాకెంతో గర్వంగా వుంది మిత్రమా.

'అదే మరి! దేనికైనా కాలం కల్సిరావటం అంటే ఇదే! చూశావా... మేజిక్ నేర్చుకోవటమే కాక బి.ఏ. డిగ్రీ కూడా సాధించాడు..

'అంతే కాదు సదాశివం! మా రామ్ ఎం.ఏ. పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. వాడి శ్రద్ధ పట్టుదల చూస్తుంటే నాకెంతో తృప్తిగా వుంది. ఆత్మీయ సహాధ్యాయితో కులాసాగా మాట్లాడుతూ ఎదురుగా వుండే హోటల్లోకి తీసుకెళ్లి మంచి పార్టీ ఇచ్చాడు సీతాపతి.

★ ★ ★

రామ్ పేరు ప్రఖ్యాతులు, ప్రావీణ్యత గురించి విన్నవారై అమెరికాలో జరిగే 'తానా' మహాసభలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించి సంస్థ స్వంత ఖర్చుతో రామ్ మేజిక్ ప్రదర్శన ప్రవాస భారతీయులు వీక్షించగలిగే ఏర్పాటు చేయటం జరిగింది.

ప్రదర్శన చూచి అక్కడి ఆహుతులు విస్మయానికి గురైనారు. రామ్‌ని ఘనంగా సన్మానించి అయిదు లక్షల రూపాయల నగదు బహుమతి బహూకరించటం జరిగింది.

తన కొడుకు ప్రయోజకత్వానికి సీతాపతి మురిసిపోని క్షణం లేదు.

రష్యా, కెనడా, ఆస్ట్రేలియా... వంటి దేశాలలో సైతం మేజిక్ షోలు ఇచ్చినఘనత రామ్‌కే దక్కింది.

చిరు ప్రాయంలోనే లెక్కకు మిక్కిలి ప్రదర్శనలిచ్చిన మొట్టమొదటి వ్యక్తిగా 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోకెక్కిన తొలి భారతీయుడు రామ్‌కావటం భారత దేశానికి గర్వకారణమైంది.

దేశ రాష్ట్ర పతి.. ప్రధాని వంటి నేతల ఎదుట మేజిక్ ప్రదర్శన ఇచ్చిన అతని ప్రతిభకి మెచ్చి పది లక్షల రూపాయల క్యాష్ బహుమతి పొందగలిగిన ప్రతిభాశాలి.. అదృష్టవంతుడు రామ్!

తానొక మేజిక్ అకాడమీ స్థాపించి అనేకమందికి మేజిక్ విద్య ఉచితంగా నేర్పాలనే సదాశయం రామ్‌లో కలగటమే తరువాయి. అతనికి రాష్ట్ర ప్రభుత్వ స్థలం ఉచితంగా ఇవ్వటం.. కొండంత ఆర్థిక సహాయం చేయటంతో అకాడమీ నిర్మాణం పనులు వేగవంతమైనయ్.

రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే కాదు... యావత్ ప్రపంచంలో రామ్... 'మేజిక్ రామ్'గ చిరపరిచితుడు. పేరు డబ్బు పలుకుబడి ఇంకా ఎన్నో సాధిస్తున్న ఘనత రామ్‌కే దక్కింది.

★ ★ ★

ఆ రోజు అంతర్జాతీయ 'మెజీషియన్స్' డే!. అత్యంత ఘనంగా సిటీలో జరుగుతోంది. ఆ ఫంక్షన్‌కి రాష్ట్రం నలు మూలలల నుండి ప్రతిభ గల మెజీషియన్స్ ఎందరో వచ్చారు.

అతిథులతో పాటు రామ్‌కూడా పార్టీలో పాల్గొనక తప్పలేదు.

డిన్నర్ అయిన వెంటనే రామ్ స్పృహ తప్పిపడిపోయాడు. వెంటనే దిగ్భ్రాంతికి లోనైనవారు అంబులెన్సు తెప్పించి రామ్‌ని హాస్పిటల్‌కి ఆఘమేఘాలమీద తరలించారు.

డాక్టరు రామ్‌ని పరీక్షించి పెదవి విరిచారు. అప్పటికే ప్రాణం పోయిందని నిర్ధారించారు.

ఫుడ్ పాయిజన్ కారణంగా మేజిక్ రామ్ మృతి చెందేడనే వార్త సిటీ అంతా పాకింది.

పేపర్‌వారు... ఎలక్ట్రానిక్ మీడియా క్షణాల్లో హాస్పిటల్ కొచ్చివాలారు.

పిన్నవయసులో ఎంతో ఎత్తుకు ఎదిగిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన రామ్ విలువైన ప్రాణాన్ని గిట్టని ప్రత్యర్థులు కావాలనే ఫుడ్ పాయిజన్ చేసి పొట్టన పెట్టుకోవటం జరిగిందనే వాస్తవాన్ని పత్రికలన్నీ ప్రముఖంగా ప్రకటించి సంతాపాన్ని తెలియజేసినయ్!!

- : సమాప్తం :-